

# అర్ధాంగుల ఆర్థిక సూత్రాలు!

## ఉపోద్ఘాతం

నా కెన్నాళ్లనుంచో మా ఆవిడ అద్వితీయమైన మనిషన్న అభిప్రాయం ఉంది దానికి కారణం ఆర్థిక విషయంలో మా ఆవిడ కొన్ని సూత్రాల్ని అనుసరించి ప్రవర్తిస్తుంది ఆ విధంగా మరెవరి భార్యలు ప్రవర్తించరని అనుకొన్నాను మా ఆవిడ ప్రవర్తను పన్నెండేళ్లపాటు గమనించి ఆరు సూత్రాలు రూపొందించాను అవి గత సంవత్సరం బెంగుళూరులోని రాజాజీ నగరపు తెలుగు సమితి సభ్యులముందు, ఎన్ ఏ ఎల్ తెలుగు సాంస్కృతిక సమితి సభ్యుల ముందు ఉంచాను అందులో భార్యలు కలవారు కొందరు "యురేకా! మా, మా, ఆవిడలు అనుసరిస్తూ వచ్చిన, మాకు అర్థం కాకపోతూ వచ్చిన, ఆర్థిక సూత్రాలు ఇవే! ఇకముందు మా, మా భార్యల్ని అపార్థం చేసుకోమని, ఈ అంతర్జాతీయ మహిళా సంవత్సరానికి ఉడతాభక్తిగా, ప్రమాణం చేస్తున్నాం" అన్నారు ముందుకు వచ్చి మా ఆవిడ ఆర్థిక విషయాలలో అద్వితీయురాలు కాదన్న విషయం నాకు ఆశాభంగం కలిగించింది

కాని ఇంతలో ఓ చిన్న ఆశాకిరణం కనిపించింది నేనీ సూత్రాల్ని తొందరగా బహుళ ప్రాచుర్యం కలిగిన ఏ పత్రికలోనైనా ప్రచురిస్తే (ఈ ఎలుకల పరుగు పందాల రోజుల్లో ఏ పార్కిన్ సన్నో నాకంటే ముందే ప్రచురించకుండా) న్యూటన్ సూత్రాలకి కారణభూతమైన ఆపిల్ పండుకి చిరస్థాయిగా కలిగిన గౌరవం అయినా మా ఆవిడకు కలుగుతుందని తోచింది

## మొదటి సూత్రం

బాగుపడాలంటే బంగారం కొనాలి!

బంగరం గురించి మాట్లాడే ముందర మీకు అర్థంకావాల్సిన పదజాలం చాలా వుంటుంది తులం, కాసు, చిన్నం, ధర్మకాటా, తరుగు, టంకం వగైరాలు మీరు బాగా తికమకపడి "కాసు కెన్ని గ్రాములు?" అని అడుగుతారు "తులానికి ఒకటిన్నర కాసులు" అంటుంది మీఆవిడ మీ కర్థంకాకపోతే ఎవరిది తప్పు? చిన్నప్పుడు మీకు లెక్కల్నేర్పిన మేష్టారిది!

ఉదాహరణకి ఆరు సంవత్సరాల క్రితం జరిగిన విషయం మీకు గుర్తుకుతెస్తే ఈ మొదటి సూత్రం మీ కర్థమౌతుంది అప్పుడు మీఆవిడ దగ్గర అడపాతడపా పుట్టింటివారిచ్చిన డబ్బు నాలుగువందలయాభై వుంది ఆరోజుల్లో కాసు నూటయాభై రూపాయలు మీరు "ఆ డబ్బు ఫిక్సెడ్ డిపాజిట్‌లో పడేస్తాను" అంటారు దానికి మీఆవిడ "ఈ రోజుల్లో డబ్బుకి విలువేం వుంది మూడు కాసులు పెట్టి ఓ జత గాజులు చేయించుకొంటాను పెద్దపిల్ల పెళ్లి కెదిగేసరికి ఇంట్లో కొంత బంగారం వుండటం మంచిది" అంటుంది ఇద్దరు బంగారం కొట్టుకు వెళ్తారు అక్కడ మీఆవిడ కటింగ్ గాజులు చెయ్యమని వాళ్లకి పురమాయిస్తుంది తయారైన గాజులు మూడు కాసులుండాలంటే తరుగు ఓ యాభై రూపాయలు, మజూరీ ఓ యాభై రూపాయలు కావాలంటాడా పెద్దమనిషి

"చిట్టీ! ఆ నూరు ఎక్కడని?" అని మీరడగరు పిల్లలకి గుడ్డలు మీ అత్తవారిస్తే కుట్టుకూలి ఎవరిస్తున్నారు? మీరే! మీరున్నదే అందుకు ఆ విషయం పెళ్లయిన రెండు మూడేళ్లలోనే మీ కర్థమయివుంటుంది

ఆ కొట్టుచుట్టూ తిరగటానికి ఓ యిరవై రూపాయలదాకా తిరుగుడు ఖర్చుపెట్టాక అన్ని ఖర్చులు వెరసి 570 రూపాయలకి ఆ జత గాజులు మీ యింటికి చేర్తాయి

మీఆవిడ ఆ గాజుల్ని మీ పక్కింటి వనజగారికి చూపిస్తుంది ఆవిడ "మీవారు చేయించారా?" అని అడగడం మీకు వినిపిస్తుంది "అంత భాగ్యం కూడాను నా వంటిమీద, నా పిల్లల వంటిమీద వున్న బంగారమంతా మా పుట్టింటివారు పెట్టిందే" అని మీఆవిడ నిట్టూరుస్తుంది

కాలగర్భంలో మూడు సంవత్సరాలు గడిచిపోతాయి మీ పక్కింటి వనజగారు మిరియాల గాజులు చేయించుకొని మెరిసిపోతూ వుంటుంది ఆమాట మీరనరు అంటే బతకరు మీ ఆవిడే అంటుంది తరవాత తనుకూడా అల్లా మెరిసిపోవాలన్న కోర్కె వెలిబుచ్చి, అప్పైన పాత గాజులు చెరిపించి మిరియాల గాజులు చేయించుకొంటుంది

ఈసారి తరుగు మజూరి కలిసి నూటయాభై రూపాయలవుతుంది తిరుగుడు ఖర్చు మరో పాతికా ఇవన్నీ కలిసి మొత్తం 745 రూపాయలవుతుంది

మరో మూడు సంవత్సరాలు గిర్రున తిరుగుతాయి బంగారం ఖరీదు పెరిగి కాసు మూడు వందలవుతుంది "నే చెప్పలేదూ! ఈ మూడు కాసుల గాజులు ఇప్పుడు తొమ్మిది వందలు చేస్తాయి" అంటుంది, ఆవిడ కాని నిజానికి ఆ గాజులు అరిగి తూస్తే మూడు కాసులుండవు అవి అమ్మితే 800 రూపాయల కంటే రావు ఆ మాటే మీరంటే "450 రూపాయలు పెట్టిన బంగారం 800 చేస్తోందంటే ఏమిటి? బంగారం మీద పెట్టిన ఖర్చుకి ఢోకా లేదని [illegible]ం కావడం లేదూ" అని ఆవిడ అంటుంది

మీరు ఫిక్సెడ్ డిపాజిట్‌తో అరేళ్ల క్రితం 570 రూపాయలు, మూడళ్ల క్రతం 175 రూ వేసిఉంటే మొత్తం 275 రూ అయినా వడ్డీ వచ్చి ఉండేదీపాటికి అని లెక్కలు కడ్తారుత్త కాబూలీవాళ్లలాగా నిజం చెప్పండి ఆవిడ ఆ గాజులు వేసుకొని మెరిసిపోతుంటే చూసి మీరు ఆనందించలేరూ! దాని విలువకూడా ఫిక్సెడ్ డిపాజిట్‌తో వేసి చూడండి అప్పుడు త్రాసు ఆవిడవేపే మొగ్గుతుంది

## రెండో సూత్రం

పుట్టింటివారిచ్చిన సొమ్ము తరగదు!

మీరు, మీ ఆవిడ మీ అత్తవారి ఊరు వెళ్లినప్పుడు మీ మావగారు బట్టలు పెట్టకుండా,



మీ ఆవిడ చేతిలో ఓ మూడు వందలు పెడ్తారు మొగవాళ్లందరికీ ఉన్న బలహీనతే మీకూ ఉంది "చూడు చిట్టీ! ఆ డబ్బు నా చేతికియ్యి మనూరు వెళ్లగానే ఇస్తాను" అంటారు ప్రయాణాల్లో ఎంత డబ్బూ చాలదుమరి ఆవిడ ఇస్తారు మీ అత్త వారి ఊళ్లో, మీ ఊళ్లో దొరకని చీరలు దొరుకుతాయి అవి బావుంటాయికూడాను ముఖ్యంగా మి ఆవిడకి అందుకని "మావాళ్లిచ్చిన డబ్బు మీదగ్గరుంది కదా! అందులో ఒక వంద ఇలా ఇవ్వండి ఓ చీర కొనుక్కుంటాను" అంటుందావిడ ఆవిడ డబ్బు ఆవిడ కివ్వడానికి మీకేం బాధ అనిపించదు ఇస్తారు

మీరు మీ ఊరు తిరిగివచ్చిన కొద్ది రోజులకి ఏ బాకీలు వస్తాయి ఆ సందర్భంలో మీరు మీ ఆవిడ కివ్వవలసిన బాకీ రెండు వందలే కాక మరో పాతిక కలిపి బహుమానం పేరుతో వడ్డీ చెల్లిస్తారు అసలు గొడవ అక్కడే వస్తుంది మీ ఆవిడ మీ ప్రేమాభిమానాల్ని అర్థం చేసుకోదు పైగా "మీరింకా నాకో వంద ఇవ్వాలి!" అంటుంది

మీరు "నువ్వది అప్పుడే తీసుకొన్నావుగా" అంటారు

"మీరు కొన్న చీరకూడా మా నాన్నగారి లెక్కలోనే వేస్తారా?" అని ఆవిడ అడుగుతుంది దాని అర్థం మీకింకా బోధపడలేదా? చెప్తాను వినండి మీరు మీ ఆవిడ దగ్గర అప్పు చేసిన మూడు వందలలో ఒక వంద ఆవిడ చేతికిచ్చి చీర కొనుక్కోమనడం ద్వారా మీ విధి మీరు నిర్వర్తించారు అందుకే మిమ్మల్ని భర్తనీ, ఆవిడను భార్యనీ అన్నారు

ఆ విధంగా ఆవిడ పుట్టింటివారిచ్చిన డబ్బు మీ లెక్కల్నీ, బడ్జెట్‌ని తారుమారు చేస్తుంది కొన్నేళ్లపాటు ఆ డబ్బు రసాయినిక చర్యలో కెటలిస్టు లాంటిదని, అది క్రయం వల్ల ఖర్చు కాదని మీ రెప్పుడు గుర్తిస్తారో అప్పుడు ఆ మొత్తం మిమ్మల్నిబ్బంది పెట్టడం మానేస్తుంది

**మూడో సూత్రం**

వస్తువులు చవకగా అమ్మేచోట, అమ్మే టప్పుడు కొనుక్కోవాలి!

ఈ సూత్రం మీ కర్థమైనట్టే యుండి అర్థమవకుండును దానికి కారణం ఈ సూత్రాన్ని మీ ఆవిడ అమలులో పెట్టే విధానం దీనికి నాలుగు ఉదాహరణలు చెప్తాను

మీ ఊరి పెద్ద మార్కెట్టులో కూరలు చవకగా అమ్ముతారు మీ పక్కింటి వనజగారి భర్త ప్రతి వారం అక్కడే కూరలు కొని తీసుకొనివస్తాడు మీరు కొనరు ఎందుకు? ఆయన బంగారు కొండ కనక, మీరు బడుద్ధాయిలు కనక— ఏదో ఒకటి, లేక రెండూను ఒక రోజున మీరు మీ ఆవిడ పోరు భరించలేక మీ ఆవిడతో బజారుకి బయల్దేర్తారు మీరు సిటీబస్సులో వెళ్లి వచ్చేద్దామన్న ఉద్దేశంతో బస్సు స్టాపు వైపుకి నడుస్తారు మీ ఆవిడ "చక్కగా రిక్షాలో (ఆటోలో) వెళ్దాద్దామండి అల్లా అయితే పని తొందరగాను పూర్తవుతుంది పైగా సరదాగా ఒకళ్ల నొకళ్లం ఆనుకుని కూర్చుని షికారు కొట్టినట్టవుతుంది ఈ మధ్య అల్లా తిరగ చూస్తుంది మీరు మంచులా కరిగి సరేనంటారు రెండ్రూపాయల ఖర్చుతో పెద్ద మార్కెట్టు చేరుకొంటారు

మీ ఆవిడ మీకు ఒక వారానికి సరిపడ్డ కూరలు కొంటుంది పది రూపాయలు పెట్టి మీరక్కడ కొన్న కూరలు మీ పేటలోనే కొంటే 12 రూపాయలు అయ్యేదని రెండ్రూపాయలు ఆదా అని మీ ఆవిడ సంబర పడుతుంటే, మీరు రిక్షాకి రెండ్రూపాయ లైందని నడిచి ఇంటికి వెళ్లే పక్షంలో నష్టంగాని లాభం లేకుండా తునితగివు అవుతుందని అంటారు అక్కడే సరిగ్గా మీ ఆవిడకి మీరంటే వొళ్లు మండేది! ఆవిడ వెంటనే మరో వారానికి సరిపడా కూరలు కొని, మరో రెండ్రూపాయలు ఆదా చేస్తుంది బరువుతో తిరిగి ఇంటికి వెళ్లేటప్పుడు రిక్షావాడు మరో అర్ధరూపాయి యెక్కువ కావాలని నిర్మొహమాటంగా అడిగి తీసుకొంటాడు మీ పేటలో అదే కూరలు కొంటే అదే డబ్బు




ఖర్చయ్యేది! మీరామాటే అంటారు "అయితే పెద్ద మార్కెట్టులో మనం తీసుకొన్న కూరలు చాలా తాజాగా లేవూ!" ఆవిడ మిమ్మల్ని నిలదీస్తారు మీరు పెద్ద మార్కెట్టులో కొన్న కూరలు రెండ వారాలపాటు తాజాగా ఉంటాయా? అంటూ చొప్పదంటు ప్రశ్నలు వేస్తే మీ ఆవిడకే కాదు ఎవరి ఆవిడకైనా వళ్లు మండుతుంది

ఇంక మనలో కొందరికి ఘరానా ఉద్యోగాలుంటాయి వాటితోపాటు ఘరానా భార్యలు కూడా ఉంటారు మీ ఆవిడ, కాని ఖర్చు లేకుండా బలమైన ఆహారం వండటం గురించి వనితల పత్రికలో చదివింది అందులో చెప్పిన ప్రకారం మీ ఆవిడ మిమ్మల్ని కారు ఊరు బయటికి నడపమంటుంది అక్కడో చింతచెట్టు దగ్గర కారు మీచేత ఆపిస్తుంది మీచేత చింతచిగురు కోయిస్తుంది ఆవిడ చింత లంటారా? వాడారేకాని ప్రత్యేకించి చింతచిగురు కోసం పోయించలేదుకదా!

మూడో ఉదాహరణ ముచ్చటైనది బాంబేలో బాంబే డైయింగ్, అహ్మదాబాద్‌లో కాలిసింఫ్, లక్నోలో హకోబా, ధర్మవరంలో పట్టు, బందారు లంకలో చేనేతవి, చీరలు చవకగా అమ్ముతారు (ప్రతి ఊరుకి చీరల విషయంలో ఏదో ఒక ప్రత్యేకత ఉంటుందని మీ నమ్మకం అంటారా? అనండి పోయిందేమీలేదు) అందుకని మీ పక్కింటి వనజగారు ఆ వూర్లు వెళ్లినప్పుడల్లా, మీకాదా చేసి పెద్దా మన్న సదుద్దేశంతో మీ ఆవిడ వనజగారి ద్వారా మూడేసి చీరలు తెప్పించుకొంటుంది ఆ చీరలకి, మీ ఊళ్లో ఖరీదెక్కువ అసలు ఊళ్లో కొంటే లాభం ఎక్కువ చీరలు తెప్పించుకొంటే ఇంకా ఎక్కువ లాభం!

కాని ఇవేమీ మీరు అర్థం చేసుకోరు మీరో బుద్ధావతారం అందుకని "అసలు చీరలే కొనకపోతే అంతా లాభమే కదా!" అని సణుగుతారు ఆవిడ దాంతో "తెల్లచీర కట్టిన దెవరికోసం?" అనో "నే నందంగా ఉండటం ఎవరికోసం? ఎవరికోసం?" అనో ఓ పాట విషాదంగా ఆలపిస్తుంది

దానికి మీరు పల్టీ కొట్టకపోతే మీరు కారణ జన్ములో, లేక పూర్వజన్మలో మీరు రాయో రప్పో!

ఇంకా ఈ మూడో సూత్రం అర్థం కాలేదా? అయితే మరో ఉదాహరణం చెప్తాను వినండి ప్లాస్టిక్ బకెట్ కొన్నవాళ్లకి సబ్బుబిళ్ల ఒకటి ఉత్తినే ఇస్తానంటాడో డీలరు అతి పొదుపరైన మీ ఆవిడ ఆ అవకాశం పోగొట్టుకోడం ఇష్టంలేక ఆ బకెట్ కొంటుంది మీ రావిడ ఉద్దేశం అర్థం చేసుకోకుండా పెద్ద రాద్ధాంతం చేస్తారు ఏమన్నా బాగుందా మీ ప్రవర్తన?

(ఇంకా వుంది)



# అర్ధాంగుల ఆర్థిక సూత్రాలు!

నవన శర్మ

*(గత సంచిక తరువాయి)*

## నాలుగో సూత్రం

వస్తువులు బేరం చేసే కొనాలి! బేరాల సంగతి మగవారికి విడిచిపెట్టరాదు

భార్య లందరు సాధారణంగా ఇల్లా ఆలో చిస్తారు "భర్తలనే వాళ్ల నొక్కళ్లనీ బజారుకు పంపిస్తే, వీళ్లని మోసం చెయ్యడం కోసమే అక్కడ షాపులు తెరుచుకూర్చున్నవాళ్ళు వీళ్లని మోసం చేస్తారు కనుక భార్యలే ఇంటికి కావల్సిన వస్తువులు కొనాలి అల్లా అని భర్తలని ఇంటి దగ్గర వదిలి వెళ్లరాదు ఎందుకంటే ప్రతి భర్తకి సాధారణంగా రెండు చేతులుంటాయి చెరో చేత్తో చెరో సంచి మొయ్యగలిగిన భర్తలతో వెళ్తే, ఇంటికి కావలసిన కూరలన్నీ లేక సరుకులన్నీ ఒకేసారి ఇంటికి తెచ్చు కోవచ్చు కూలీల బెడద ఉండదు"

మీరు మీ ఆవిడ వెంట కూరల బజారుకు వెళ్లారనుకొందాం అప్పుడు మీ ఆవిడ చూపించే పాదపరితనానికి ఒక ఉదాహరణ చెప్తాను

మీరు టొమేటాలు కొందామని వెళ్లారు మీ ఆవిడ "కిలో ఎంత ?" అని అడుగుతుంది దానికి జవాబుగా అమ్మే మనిషి "రూపాయి ఇరవై పైసలు" లంటుంది మీ ఆవిడ "రూపాయి చేసి ఇయ్యి" అంటుంది ఆ మనిషి "కిట్టదు" అని చెప్తుంది ఓ అయిదు నిముషాలపాటు ఈ విధంగా బేరాలయ్యాక రూపాయి పదిహేను పైసలకి బేరం తెగుతుంది అప్పుడు మీ ఆవిడ మీకేసి విజయ గర్వంతో చూసి ఆ పైన ఆ మనిషితో "పావుకిలో యియ్యి" అని చెప్పి తీసుకొంటుంది తీసుకొన్నాక కూరలమ్మే మనిషికి ఎంతివ్వాలో, మూడుసార్లు లెక్క కట్టబోయి తెగక మిమ్మల్నడుగుతుంది మీ ఆవిడ మీరు టపీమని ఇరవై యెనిమిది మున్పావ్ పైసలని చెప్తారు మీ ఆవిడ అప్పుడు ముప్పై పైసలు తీసి ఆ మనిషి కిచ్చి "పైసియ్యి" అంటుంది ఆ మనిషి "చిల్లర లేదు" అంటుంది మీ ఆవిడ లక్కడ్నుంచి అయిష్టంగా కదుల్తుంది

మీకు వేపకాయంత వెర్రి ఉంటే "ఇంతసేపూ మనం బేరం చేసిందెందుకుట ?" అని అడుగుతారు "మనం మొదటి కూర బేరమాడకుండా కొంటే రెండోదానికి మూడోదానికి వాళ్లు ఇష్టమొచ్చినంత చెప్తారు ఇంత చిన్న విషయాలు కూడా తెలియవేం మీకు ?" అని ఆవిడ మీకు చీవాట్లు పెడ్తుంది మీరు నాలిక్కరుచుకొని మర్నాడు డిస్పెన్సరీకి వెళ్ళి మందు వేయించుకొంటారు

## అయిదో సూత్రం

డబ్బు దగ్గరుంటే ఖర్చవుతుంది ఉన్నది చిల్లరగా ఉంటే మరింత తొందరగా ఖర్చవుతుంది!

అంటే మనం మన డబ్బుని బాంకులోంచి తీయరాదు తీసినా బయటికి వెళ్లేటప్పుడు ఇంట్లో పెట్టి వెళ్లాలి చిల్లరగా యెప్పుడూ తీసుకు వెళ్లరాదు

ఈ సూత్రంతో మీరు ఏకీభవిస్తారుకూడాను కాని అది మీ ఆవిడ అమలు పెట్టే విధానమే మీకర్థమై చావదు దానికి మీ రావిడను అనుకోడం తప్పు మీకర్థం కాకపోడానికి మీరే బాధ్యులు అయితే ఈ వ్యాసాన్ని మీలాంటి నాలాంటి వారికోసం వ్రాస్తున్నాను కనక ఎంతో కష్టపడి నేను అర్థం చేసుకొన్న ఈ సూత్రాన్ని రెండు ఉదాహరణలిచ్చి మీ కర్థమయ్యేలా చెప్తాను

మీరు, మీ ఆవిడ కూరల మార్కెట్టుకు వెళ్తారు అక్కడ ముందస్తుగా మీ ఆవిడ రూపాయి నలభై పైసలుపెట్టి బంగాళదుంపలు కొంటుంది చిల్లర ఉంటే త్వరగా ఖర్చవుతుందని ఆవిడకు తెలుసును అందుకని ముందర ఆ చిల్లర్ని వదుల్చు కోవాలని తాపత్రయపడుతుంది కాని ఫలితంగా ఒక అర్ధరూపాయి, రెండు పావలాలు, నాలుగు పది పైసల నాణాలు తీసి ఆవిడ ఆ కొట్లో ఇస్తుంది ఆ విధంగా తీసుకువెళ్లిన చిల్లర తొందర్లో ఖర్చయి పోతుంది అంటే పై సూత్రం మరోసారి బుజువైందన్నమాట మీ ఆవిడ ముందు కూరల సంచీ మోసుకొంటూ వెనకాతల మీరు మార్కెట్టు బయటికి వచ్చాక మీ ఆవిడకి పదిపైసల పచ్చిమిరప కాయలో, అల్లమో కావలసి వస్తాయి ఆవిడ తిరిగి లోపలికి వెళ్లి కావలసింది కొని పదిరూపాయల నోటు బయటికి తీస్తుంది అమ్మే మనిషిదగ్గర చిల్లరుండదు మీ ఆవిడదగ్గర ముందరే లేదు పక్కకొట్లోవాళ్లు ఇవ్వరు ఆఖరికి ఎల్లాగైతేనేం ఆవిడ తన కిష్టమైన చామదుంపలు మరో కిలో వేరే షాపులో కొని చిల్లర సంపాదిస్తుంది "ఆ పది రూపాయలు ఏం బంగాళా దుంపలు కొన్నచోట మారిస్తే పోలా ?" అన్నట్టుగా మీరు నవ్వుతారు "కొబ్బరికాయ పచ్చడిలోకి పచ్చిమిరపకాయలు మీ కిష్టమని కొన్నాను గాని నాకోసం కాదుకదా! అవి కొనకుండాపోతే అసలు పది రూపాయలు మార్చాల్సిన అవసరమే రాకపోను" అంటూ ఆవిడ మూతి విరుస్తుంది

మీరు మీ అమ్మాయి లిద్దరికి గౌన్లు కొందాం అనుకొంటారు గౌను ఒక్కంటికి ఇరవైరూపా యల చొప్పున రెండు గౌన్లకి నలభైరూపాయలని లెక్కకట్టి ఆపైన రిక్షా ఖర్చులకి కాఫీ ఖర్చులకి మరో అయిదు రూపాయలు అదనంగా అంచనావేసి మొత్తం నలభైఅయిదు రూపాయలు బీరువాలోంచి లెక్కపెట్టి తిసుకొని బీరువాకి భద్రంగా తాళం వేస్తుంది

బజార్లో రెండు గౌన్లు చేరి నలభైయెనిమిది రూపాయి లవుతాయి మిగతా గౌన్లు మన్ననన్నా మన్నవు, బాగుండనన్నా బాగుండవు కొంటే ఈ రెండే కొనాలి ఆ విషయంలో మీఆవిడకి స్పష్టమైన అభిప్రాయా లున్నాయి డబ్బు చాలనందుకు మీఆవిడ చిన్నబుచ్చుకొంటుంది అనుభవజ్ఞులైన మీరు ఎందుకైనా మంచిదని చెక్‌బుక్ తీసుకువెళ్లనే వెళ్లారు మీ మోహం, నామోహం చూడగానే ఏ షాపువాడైనా మనం దొంగచెక్కు లివ్వగలిగిన ధైర్య వంతులం కామని గ్రహించేస్తాడు అందుకని "చెక్కు తీసుకొంటావా ?" అని అడిగితే "తప్ప కుండాను" అంటాడు సరిగ్గా అలాంటి సమ యంలో మీఆవిడకి ఎన్నాళ్లనుంచో కొందామను కొంటున్న దుప్పట్లు కనిపిస్తాయి "ఎల్లాగో రిక్షా డబ్బులు దండగపెట్టాం మరోసారి దుప్పట్లకోసం పెట్టడం ఎందుకు ? యీ దుప్పట్లిప్పుడే తీసు కోనా ?" అని మాటవరుసకి మీ అనుమతి అడిగి, మీరు గంగిరెద్దులాగా తలూపగానే ఆవిడ అవి కొనేస్తుంది ఆపైన కర్టెన్లు, టేబుల్ క్లాతులు, చివర్లో ఎన్నాళ్ళబట్టీ కుదరక యీరోజున తన కళ్లబడ్డ మాచింగ్ రవికగుడ్డ కొనేస్తుంది

ఏమిటీ! యీ అయిదో సూత్రం తప్పంటారా ? అందుకనే మీఆవిడ మిమ్మల్ని "మీరుత్త అమాయకులండీ" అంటుంది మీరు డబ్బుని దగ్గరుంచుకోకుండా బాంకులో వుంచబట్టేకదా యీరోజు మీరు చెక్కు యిచ్చి అప్రతిష్ఠపాలవ కుండా కాపాడుకొన్నారు!

## ఆరో సూత్రం

ఆర్థిక విషయాలలో అంతిమ విజయం అర్ధాంగులదే!

మీ ఉద్దేశంలో మీ జీతం అనంతమైనదికాదు ఒక నిర్ణీతమైనది కనుక ఏ నెలలోనైనా మీ జీతంలో కొన్నే వస్తాయి ఎన్నో రావు! కాని మీ ఆవిడ కీవిషయంలో వేరే అభిప్రాయం వుంది, "మగవాడికి మనసుండాలేగాని భార్యలకి ఏదైనా కొనటానికి, ఎక్కడికైనా తీసుకువెళ్లటానికి మార్గమే వుండకపోతుందా ?" అని

మీరు మీ అత్తవారింటికి, కొన్ని వందలు, రైళ్ళ మోహనా బస్సుల మోహనా, పోసి వెళ్లి రాగలిగారు ఆ యాత్రలో మీ అత్తవారు మీ ఆవిడకో చీర కొన్నారు దాని కావిడ తెగమురిసి పోయి, మీ పక్కింటి వనజగారితో "నేను కట్టుకొనే చీరలన్నీ మా పుట్టింటివారు పెట్టినవే!" అంటుంది పక్క గదిలో వున్న మీ మనస్సు చివుక్కుమని ఆర్తి "నువ్వీ నెల మీ యింటికి వెళ్లక తప్పదంటే వెళ్ళొచ్చాం అవునా ? ప్రయా ణానికి ఖర్చుపెట్టిన డబ్బుకి అటువంటి చీరలు నాలుగొచ్చును" అంటారు

## అర్ధాంగులు ఆర్థిక సూత్రాలు


దానికావిడ "మిమ్మల్నే నమ్ముకుని, మావాళ్లని వదిలేసుకొని వచ్చిన నేను ఏడాదికోసారి మా అమ్మా నాన్నలను చూడటానికి వెళ్లటం మీ దృష్టిలో ఘోరాపరాధం" అంటూ ముక్కోగబీలుస్తుంది "అదేంలేదు చిట్టీ ! ప్రయాణాలు, చీరలు ఒక నెలలో కుదరవన్నాను అంతేగాని మీయింటికి వెళ్లొద్దనలేదు" అంటూ నచ్చచెప్పబోతారు

"ఎందుక్కుదరదు ? మీ సిగిరెట్లకి డబ్బుంటుంది మీ పిల్లలకి కొండమీద కోతిని కొనడానికి డబ్బుంటుంది నా కేదైనా కొనాల్సివచ్చేసరికి మీకుండదు మీకు చేతకాకపోతే ఆ డబ్బులేవో నాకివ్వండి ఇల్లు నేను నడుపుతాను" అనేస్తుందావిడ

ఆ సమయంలో "నా జీతం తెచ్చి నీ దోసిట్లో పోస్తాను ఇల్లు నువ్వే నడుపు" అంటారు

అంతిమ విజయం ఎవరిది ? అర్ధాంగులదే !

(అయిపోయింది)




## డాక్టర్ సలహాలు

**— డా॥ కె. వెంకటేశ్వరరావు**

సి యస్ పి — నిర్మల్

నా తల వెంట్రుకలు కుదుర్లోంకి వూడిపోవుచున్నవి నెల రోజులనుండి యిలా వుండటమువల్ల తల కొంత భాగము బట్టతలగా అయినది కొన్ని రోజులకి మొత్తము తల బట్టతలగా అవుతుందేమోనని భయముగా వున్నది జుట్టు వూడటము తగ్గాలంటే ఏమి చెయ్యాలి ?

★ వెంట్రుకలు వూడటానికి కారణాలు, నివారణ యిదివరకు ఎన్నోసార్లు వ్రాశానుగా, మీలాగే యెందరో యీ ప్రశ్న పదే పదే వ్రాయటం వల్ల — అటువంటివారి దృష్టి పాత పత్రికలవైపు మళ్లించటమే యీ వుత్తరం వ్రాయటంలోని ముఖ్యోద్దేశం ! దయచేసి పాత పత్రికలు చూడండని, తిరిగి ఎవరూ యీ ప్రశ్నని వ్రాయవద్దని నా మనవి !

టి వి ఆర్ — కోటబొమ్మాళి

నా వయస్సు 22 సం లు పుట్టుకతోడనే నా కుడికంటికి నొసలు భాగమునందు అర్ధరూపాయంత తెల్లని మచ్చ వున్నది చాలా అందవికారముగా వున్నది అందరూ పుట్టుమచ్చ అంటున్నారు ఈ మచ్చ తొలగించే మార్గము వున్నదా ?

★ తెల్లని మచ్చలనేవి యెన్నిఅయినాసరే, యెక్కడవున్నాసరే — అవి పుట్టుకతోనే యేర్పడి వుంటే వాటిని "విటిలైగో" అని వుంటారు

ప్రస్తుతం, భారతీయ జాతీయ వైద్య విధానాల పునఃపరిశోధన సంస్థ, (సి సి ఆర్ ఇ ఎం హెచ్) న్యూఢిల్లీ, దేశమంతటా వున్న దాని విభాగాలు, నిరూపించిన (బడుతున్న) ఒక పైపూత మందు బాగా పనిచేస్తున్నదని, కొన్ని రోజుల క్రితమే వెల్లడయిన సంగతి ఢిల్లీలో యీ సంస్థ విలాసం — ఇ 25 — డిఫెన్సు కాలనీ — న్యూఢిల్లీ వీరికి వ్రాస్తే మీకు దగ్గరలో వున్న వీరి విభాగం — అడ్రసు దొరుకుతుంది

వై ఎమ్ ఆర్ — కొత్తపేట

నా ముక్కుమీద నల్లని పొడ వున్నది సుమారు 5 నెలలనుండి వున్నది ఇది మొఖమంతావ్యాపించేటు వున్నది దీనికేమైనా మందు తెలియజేయండి

★ నల్లని పొడ కొన్ని నెలల క్రితం మాత్రమే ఏర్పడి పెరుగుతూ వుండటాన్ని చర్మ వైద్యులు ప్రత్యక్షంగా పరిశీలించి, చర్మంలో సూక్ష్మక్రిములు మొదలయినవి వున్నవా లేవా అని కనుగొనటం తదనంతరం చికిత్స ప్రారంభించటం అవసరం

ఇంతలోగా 'కెనలాగ్ — ఎస్' పైపూతగా వాడటం, "రెడాక్సాన్" లేక "సెలిన్" 500 మి గ్రా రోజుకి ఒకేమారుగా మాత్రల రూపంలో లోనికి తీసుకోవటం మంచిది

ఎస్ ఎమ్ ఎన్ — హైదరాబాద్

5 సం ల క్రితం కొత్తచెప్పులు వాడిన ఫలితంగా రెండు కాళ్ళపై బాగా పుండ్లుపడ్డాయి చూడ్డానికి చాలా అసహ్యంగా వుంటున్నవి కొంచము దురద వుంటుంది మందులు వాడితే చీముకారుట తగ్గిందిగాని పుండు మానటంలేదు దీనికి నివారణోపాయం తెలియజేయండి

★ కొందరికి, కొన్నిరకాల తోళ్లతో తయారు చేసిన పాదరక్షల వల్ల — ఇలా రావటం జరుగుతున్నది ఎక్కువగా, "ప్లాస్టిక్" — "పాలితీన్" కొన్ని జంతువుల చర్మాలు పాదరక్షల తయారీలలో వుపయోగింపబడినప్పుడు అది వాడినవారికి "అలర్జీ" అంటే శరీరం దాన్ని సహించకపోవటం ద్వారా, ఆచోట కురుపులు, దురద, పుండ్లు మొదలయినవి ఏర్పడటం జరుగుతుంది దీనికి ఆ పాదరక్షలు వాడకం పూర్తిగా మానటం, చర్మానికి "కెనలాగ్ — ఎస్" స్కిన్ ఆయింట్మెంటు వ్రాస్తే తగ్గుతుంది

ఎస్ వి కె — పేటూరు

నా కుమారుడు పుట్టిననాటినుండి నేటివరకు వృషణములు బయటకు కన్పించుటలేదు ఇప్పుడు ఏడవ సంవత్సరము ఏడ్చినపుడు లింగమునకు ఇరుప్రక్కల వాపుమాదిరిగా కన్పించును తరువాత మామూలుగా వుండును దీనికి కారణమేమిటి ? దీనికి చేయవలసిన వైద్యము తెల్పండి

★ ఇలా వుండటాన్ని "అన్ డిసెండెడ్ టెస్టిస్" అంటారు ప్రతి శిశువుకీ తల్లి గర్భంలో వుండే సమయంలో ఈ రెండు వృషణాలూ కడుపు లోపల వుంటాయి తల్లికి 6 వ నెల రాగానే, గర్భంలోని శిశువు యొక్క వృషణాలు క్రమంగా కడుపు (పొట్ట) గోడలోని ఒక కాలువ ద్వారా వృషణాల ప్రకృతిసిద్ధమైన సంచీలోకి లాగిబడతాయి ఇలా జరగకపోయినా, మార్గావరోధం ఏర్పడినా, పైన మీరు వ్రాసినట్లు జరుగుతుంది ఏడ్చినప్పుడు "వాపు" కనబడటం "కాలువ" వున్నదనీ ఏదో యితర మార్గావరోధాలు వుండి వుంటాయని తెలియజేస్తుంది శస్త్ర వైద్యుల సలహామీద వారు చెప్పినట్లుగా శస్త్రచికిత్స చేయిస్తే మామూలు పరిస్థితి ఏర్పడుతుంది

ఎమ్ ఎల్ ఎస్ — హైదరాబాద్

మలవిసర్జన చేసేటప్పుడు శబ్దము ఎందుకు వస్తుంది దీనికి కారణము, నివారణోపాయము తెలుప ప్రార్థన

★ ఆహారంతోబాటుగా కొంచెంగా గాలిని కూడా మనం లోపలికి మింగటంవల్ల, జీర్ణకోశంలోకి యీ వాయువు ప్రవేశిస్తుంది ఈ గాలి కడుపులో ఆహారం వున్నంతసేపు వుండి, కొంత త్రేనుపుల ద్వారా బయటికి రావటం జరుగుతుంది

చిన్న ప్రేవులు, పెద్ద ప్రేవులలో ఆహారంతో బాటుగా యీ గాలి పయనించి, చివరికి మలవిసర్జన సమయంలో వెలుపలికి వేగంగా ఎక్కువ పీడనశక్తితో విసర్జించే సమయంలో యీ శబ్దంవస్తుంది

ఇది సర్వసాధారణము, ప్రకృతిసిద్ధము అయినందువల్ల, నివారణ అనే ప్రశ్న అసలు ఎందుకు వస్తుంది ? ?